


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

సోమవారం | 12 మే 2025

పేజీలు 8


# చెయ్యి తడపకపోతే

# పనులు కావా..?



- విద్యుత్ అధికారి, సిబ్బంది నిర్లక్ష్యం..రైతుకు ప్రాణ సంకటం..
- పక్కకు ఒరిగిన స్తంభాలు, క్రిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు..
- తన స్వంత ఖర్చుతో పనిచేయాలని కోరిన పలకని వైనం..
- చెయ్యి తడిపితే కాని కుదరదంటున్న విద్యుత్ అధికారి, సిబ్బంది..
- దినదినగండం, నూరేళ్ళ ఆయుష్యుగా వ్యవసాయ పనులు..

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండలంలోని పెద్దవంగలి గ్రామంలోని రెవెన్యూలో 76 సర్వే నెంబరులో సుమారు 15 ఏకరాల విస్తీర్ణంలో నర్సయ్య అనే రైతుకు వ్యవసాయ భూమి ఆంది. ఈ భూమికి సందబంధించి 4 బోర్లకు గాను 4 ట్రాన్స్ ఫార్మర్లు, సుమారు 20కి పైగా విద్యుత్తు స్థంబాలకు తీగలను అమర్చి ఉన్నారు. అయితే గత కొన్ని నెలలుగా పోలంలో ఉన్న కొన్ని విద్యుత్తు స్తంబాలు గాలి, వర్షాలకు అటు ఇటు వరిగి విద్యుత్తు తీగలు క్రిందకు వేలాడుతూ ప్రమాదం సంభవించటానికి సంకేతాలు చూపిస్తున్నాయి. ఇదీలా ఉంటే పొలంలో ట్రాక్టరుతో సేద్యం చేయాలన్నా, హార్వేస్టర్తో పంట కోత చేయాలన్నా క్రిందకు వేలాడుతున్న విద్యుత్తు తీగలు ప్రమాద వశాత్తు ట్రాక్టరుకు. హార్వేస్టరుకు తాకి ప్రమాదం సంభవించి ప్రాణ నష్టం కలుగుతుందోనని రైతు నర్సయ్య ఆందోళన చెందుతున్నాడు.ఆ సమయంలో అందుబాటులో ఉండని స్థానిక విద్యుత్తు సిబ్బందిని వెతికి, అతనిని బ్రతిమలాడి, ఏదో ఒక విధంగా ఎల్సి తీసుకోని పని జరుపుకోవలసి వస్తుందని ఆవేదన వ్యక్త పరుస్తున్నాడు.

మిగతా 2లో

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని కంభళదిన్నే. జాలవాడీ గ్రామానికి సమీపంలో ఉన్న వంక వాగుల్లో ఉన్న ఇసుకను కొందరు ట్రాక్టర్ యజమానులు ప్రతిరోజు ఆర్ధరాత్రి వేళల్లో వందలాది ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుకను తోడేస్తున్నా ఇటు రెవెన్యూ. అటు మైనింగ్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు గ్రామంలో సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా జాలవాడీ గ్రామంలో ఓ అధికార పార్టీకి చెందిన ఓ ఛోటా నాయకుడు గ్రామంలో ఎవరైనా సరే ట్రాక్టర్లుతో ఇసుక తోలుకోవాలంటే ప్రతి ట్రాక్టర్ నెలకు రూ 20.వేలు చొప్పున మామూళ్లు ఇస్తేనే ఇసుకను గ్రావెల్ ను తోలుకోవాలని లేదంటే పోలీసులు చేత కేసులు నమోదు చేయిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతుండడంతో .. ఆ నాయకుడి బెదిరింపులకు తలోగ్గి ట్రాక్టర్లు యజమానులు ఆనేతతో ఒప్పందం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. గ్రామ ఛోటా నాయకుడికి పోలీసులు అండదండలు ఉండడంతో గ్రామంలో అధికార పార్టీకి చెందిన నాయకుడు చెలరేగి పోతున్నాడనే విమర్శలు గ్రామంలో బలంగా వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని,ఎండకాలంలో నీరు లేక ప్రజలు అల్లాడుతుంటే అక్రమ ఇసుక రవాణాను అరికట్టాల్సిన అధికారులు,పార్టీ నాయకులు ఈ విధంగా మామూళ్లకు అలవాటు పడి సహకరిస్తే ఎలా అంటూ..

మిగతా 2లో

## అక్రమ ఇసుక రవాణాకు తెరలేపిన

# ఇసుకాసురులు

- ప్రతిరోజు ఆర్ధరాత్రి వేళల్లో పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక ..గ్రావెల్ అక్రమ రవాణా
- నెలకు ఇసుక లోడు ట్రాక్టర్‌కు రూ.20 వేల చొప్పున మామూళ్లు
- అధికార పార్టీ నేతకు మామూళ్ళు ఇవ్వాల్సిందే.. లేదంటే కేసులు..
- ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న ఇసుకాసురులు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్ అధికారులు, పోలీసు అధికారులు





కంభళదిన్నే,జాలవాడీ గ్రామాలకు సమీపంలో వంకవాగుల్లో ఇసుక, గ్రేవెల్ ను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

# క్రీడల అభివృద్ధికి సహకరిస్తాం..

మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ.వెంకటేష్



మాట్లాడుతున్న మాజీ ఎంపి టీజీ వెంకటేష్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** నగరంలో క్రీడల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. నగరంలోని సుంకేసుల రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన ర్యాలీ స్పోర్ట్స్ బ్యాడ్మింటన్ అకాడమీని ఆదివారం టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికై ప్రైవేట్ అకాడమీలు ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. తాను బ్యాడ్మింటన్

మిగతా 2లో

## కొనసాగుతున్న వైశాఖ మాస

# నృసింహ జయంతి బ్రహ్మోత్సవాలు



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** మండలంలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి జన్మదినమైన నృసింహ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో వేద పండితులు విశేష పూజను నిర్వహించారు.

మిగతా 2లో



## గరుడ వాహనం పై

# ఊరేగిన చెన్నకేశవుడు



బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

**మిడుతూరు, మేజర్ న్యూస్ :** శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సింహ వాహనంపై చెన్నకేశవుడు సతీసమేతంగా భూదేవి శ్రీదేవిలలో ఉత్సవ విగ్ర హాలతో మేళ తాళాలతో గ్రామంలో పురవీధుల గుండా ఉదయం ఊరేగించారు సాయం త్రం ఏడు గంటల 30 నిమిషాలకు గరుడ వాహనంపై శ్రీలక్ష్మిచెన్నకేశవుని అలంకరించి గ్రామ వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ కార్యక్రమానికి మండల టిడిపి కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ భూమా కృష్ణ మోహన్ శెట్టి ఈవో ఏడి వెంకట రమణ,

మిగతా 2లో

## అక్రమ ఇసుక రవాణాకు తెరలేపిన ఇసుకాసురులు

(మొదటి పేజి తరువాయి)



దీనిని అరికట్టేవారే లేరా అంటూ పలువురు గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా మైనింగ్. రెవెన్యూ. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కంభళదిన్నే. జాలవాడీ గ్రామాలలో ఇసుక. గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులపై దాడులు నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టాలని గ్రమాల ప్రజలు జల్లా అధికారులను,టీడీపీ పార్టీ జిల్లా నాయకులను కోరుతున్నారు.

# చెయ్యి తడపకపోతే పనులు కావా..?

(మొదటి పేజి తరువాయి)



ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

ఈ ఇబ్బందిపై చాగలమర్రి ఇంచార్జి ఏఈ రమణయ్య వద్దకెళ్ళి సమస్య పరిష్కరిం చాలని వేడుకున్న ఆయన నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని రైతు వాపోతున్నాడు. ఓరిగిన విద్యుత్తు స్తంబాలను సక్రమంగా అమర్చి వాటికున్న తీగలను పైకి ఉండేటట్లు ఏర్పాటు చేయాలని, ఆ మరమ్మత్తు పనులకు అయ్యో ఖర్చు తానే భరిస్తానని పలుమార్లు తెలిపినా ప్రయోజనం లేదని ఆందోళన చేందుతున్నాడు. ఈ పని పూర్తి కావాలంటే కొంత మొత్తాన్ని నాకు ఇవ్వాలని ఏఈ అడిగినట్లు రైతు నర్సయ్య తెలిపాడు. క్రిందికి స్ధంబాలు, క్రిందికి వేలాడుతున్న విద్యుత్తు తీగలతో ప్రమాదం పోంచి ఉండటంతో భయపడి ఖరీఫ్ మాత్రమే పంట సాగు చేసి, రబీలో పోలాన్ని బీడు పెట్టవలసి వచ్చిందని, దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు ఆయన తెలిపాడు. ఏదీ ఏమైన ప్రభుత్వం రైతుల సంక్షేమం కోరకు ఏన్నో సంక్షేమ పథకాలు అమలు పరుస్తుంటే ఈ కూటమి ప్రభుత్వంలో మాత్రం రైతులను దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, అంతేకాకుండ పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని భాధిత రైతు సమస్య పరిష్కారానికి విలేఖరులను ఆశ్రయించినట్లు తెలిపారు. ఉన్నత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించని ఇంచార్జి ఏఈపై చర్యలు చేపట్టాలని ఆయన కోరుతున్నాడు.

**పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.. చాగలమర్రి, ఇంఛార్జీ ఏఈ రమణయ్య :** ఈ సమస్య తన దృష్టికి రాలేదని, అయినా రైతు నర్సయ్య పోలాన్ని సందర్శించి సమస్యను పరిశీలించి పరిష్కారం చేస్తామని ఇంచార్జి ఏఈ రమణయ్య తెలిపారు.

# క్రీడల అభివృద్ధికి సహకరిస్తాం

(మొదటి పేజి తరువాయి)

అసోసియేషన్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు, మంత్రిగా ఉన్నప్పుడు ఇండోర్ స్టేడి యంలో అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామన్నారు. ప్రభుత్వ నిధుల తో అలాగే సొంత నిధులతో ఇండోర్ స్టేడియాలను అభివృద్ధి చేశామ న్నారు. అన్ని క్రీడల్లో కన్నా బాల్ బ్యాడ్మింటన్ క్రీడా తక్కువ స్థలంలో ఎక్కువమంది ఆడుకునే విధంగా రూపొందించవచ్చని దీని వల్ల ఎక్కువమంది క్రీడాకారులు తయారు కావడానికి అవకాశం ఉందన్నారు. పిల్లలు ఆడుకోవడానికి చిన్నప్పటి నుంచే ప్రోత్సహిం చాలని చదువుతో పాటు క్రీడల్లో పాల్గొంటే వారికి శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా కూడా ఉల్లాసంగా ఉంటారని టీజీ వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు విజయరాజ్, రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న వైశాఖ మాస నృసింహ జయంతి బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజి తరువాయి)



శ్రీప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు, శ్రీ సుదర్శన చక్ర రాజ స్వామి వారికి 108 కలశాలతో విశేష తిరుమంజనం నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు క్రీడాంబి వేణుగోపాల స్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాలు నడుమ శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు. ఎగువ అహోబిలం క్షేత్రంలో కూడా నరసింహ జయంతి స్వాతి పర్వదినం సందర్భంగా శ్రీ జ్వాలా నరసింహస్వామి చెంచులక్ష్మి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు.శ్రీ స్వామివారి ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఉభయ దారి గా ఆళ్లగడ్డ ఏడి శ్రీ రవికాంత్ చౌదరి మరియు రంగారావు గోష్టి సభ్యులు పాల్గొన్నారు. అహోబిల దేవస్థానం మేనేజర్ మాధవన్, మనియార్ సౌమ్యనారాయణ, అర్చకులు పాల్గొన్నారు.

## గరుడ వాహనం పై ఊరేగిన చెన్నకేశవుడు

(మొదటి పేజి తరువాయి)

యరభం ప్రభాకర్ రెడ్డి కాత విష్ణువర్ధన్ రెడ్డి, తూవ్వ రామ నాగేశ్వర్ రెడ్డియరభం ప్రమోద్ రెడ్డి, కాతమోహన్ రెడ్డి ,జి.శ్రీనాథ్ రెడ్డి పర్యవేక్షించారుఆలయా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యం – కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్

**:– జిల్లా అంతటా బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు**



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** దేశ సరిహద్దులో ఇండియా, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్ర ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు ఆదివారం ముందస్తు జాగ్రత్తల పరంగా బాంబు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టామని కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. జిల్లా ఇంచార్జ్ ఎస్పీ అది రాజ్‌సింగ్ రాణా పర్యవేక్షణలో జిల్లావ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు తదితర ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలు చేశారు. జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో, సరిహద్దుల్లో, చెక్ పోస్టులలో ప్రత్యేక పోలీసు బృందాలచే తనిఖీలు చేశారు. అందులో భాగంగా నగరంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసి బస్టాండ్‌లో బాంబు స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించినట్లు డిఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య జరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రజల భద్రతే లక్ష్యంగా ముందస్తు జాగ్రత్తలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అనుమానితులను విచారిస్తున్నామన్నారు. అనుమానస్పదంగా వ్యక్తులు కానీ, వస్తువులు కానీ, కొత్తగా ఎవరైనా వ్యక్తులు తారసపడితే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ

➡ నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

**ఎమ్మిగనూరు అర్బన్, మేజర్ న్యూస్:** ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డి హాజరయ్యి నవ దంపతులను ఆశీర్వదించారు. విశాల గార్డెన్స్‌లో ఈ. వెంకటేశ్వర్లు కుమారుడి వివాహం, వెంకటాపురం శ్రీ గుంటి రంగస్వామి దేవాలయంలో మహాదేవి కుమారుడి వివాహం, ఇదే దేవాలయంలో బోయ నాగేష్ కుమారుడి వివాహం, మునెప్ప నగర్ లో రిసెప్షన్, మాచాని సోమప్ప మెమోరియల్ హాల్లో జరిగిన బుడగ జంగాల నరసింహులు కుమారుడి వివాహం, మంత్రాలయం శ్రీ రమణ కల్యాణమండపంలో 3వ వార్డు కౌన్సిలర్ వినయ్ చెల్లెలి వివాహం అదేవిధంగా ఐరన్ బండ ఏ సెంటర్ లో గొల్ల రాముడు కుమారుడి వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బీవీ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మాతృమూర్తులందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు – మంత్రి బి.సి



మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి (ఫైల్‌ఫోటో)

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** అనుక్షణం అంతులేని ప్రేమలు కురిపించే మాతృమూర్తులం దరికీ మదర్స్ డే శుభాకాంక్షలను రాష్ట్ర రోడ్లు మరియు భవనాల పెట్టుబడులు, మౌళిక సదుపాయాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి తెలిపారు. బిడ్డలను నవమాసాలు మోసి కనీ పెంచి పెద్ద చేసి విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులు చేసే తల్లికి కోటి వందనాలు స్వచ్ఛమైన ప్రేమ ఆప్యాయత అనురాగాలతో నిత్యం కంటికి రెప్పలా బిడ్డలను కాపాడేది అమ్మే అని అలాంటి మహిళలకు పాదాభివందనాలు అన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం మహిళల అభివృద్ధి సంక్షేమం సాధికారకతకు కట్టుబడి ఉందని మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు.

### బొలేరో వాహనం ఢీకొని
# నలుగురికి రక్త గాయాలు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ః**

కొలిమిగుండ్ల మండలంలోని కస్తూరిబా స్కూలు వద్ద శనివారం రాత్రి 8గంటలకు కనకాద్రిపల్లె గ్రామానికి చెందిన దూదేకుల మౌలీ సుభాన్ అనే వ్యక్తి మరో వ్యక్తి తో కలిసి కనకాద్రిపల్లె నుండి కొలిమిగుండ్లకు వస్తుండగా కొలిమి గుండ్ల వైపు నుండి కనకాద్రిపల్లెవైపు వెలుతున్న బొలోరో ఎపీ 37సిపి9070 అను వాహనం అతివేగముగా వచ్చి మోటారు సైకిల్ తరువాత తాడిపత్రివైపు నుంచి వస్తున్న జమ్మలముడుగు డిపోకు చెందినఆర్టీసీ బస్సునుఢీకొనగా మోటారుసైకిల్‌పైన కూర్చొన్న వారు విజయ ఆచారికి మరియు బోలెరోలో ఉన్న నలుగురికి రక్త గాయాలయ్యాయి. 11.05.2025న ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సి.ఐ మద్దినేని రమేష్ తెలిపారు.






# రోడ్డుపై మురికినీరు..

– వాహనాల రాకపోకలకు అంతరాయం

**సంజామలమేజర్,న్యూస్ః** సంజామల మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో ముదిగేడు – కోవెలకుంట్ల రహదారి రోడ్డుపైనే మురికి నీరు ప్రవహిస్తూ అలాగే ఫిల్టర్ నీరు , వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించి రోడ్డు అధ్వాన్నంగా తయారైంది దీంతో వాహనాల రాకపోకలకు వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్డుపై మురికి నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన చాగలమర్రిలోని అప్పటి ఆర్సీఎం ఉన్నత పాఠశాలలో 1999 -2000 పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా సాగింది. దాదాపు 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై చేరిన చిన్న నాటి మిత్రులుఒకరినొకరు పలుకరించుకుంటూ సంతోషంగా గడిపారు. పాత జ్ఞాపకాలు గుర్తు నెమరు వేసుకున్నారు . హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై,కర్నూలు,కడప, అనంతపురం తదితర ప్రాంతాల్లో స్థిరపడిన సుమారు 50మంది పూర్వ విద్యార్థులు యోగక్షేమాలు తెలుసుకుని ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యా, బుద్ధులు నేర్పిన అప్పటి గురువులు హెడ్మాస్టర్ భాస్కర్‌రెడ్డి,ఉపాధ్యాయులు జోజిరెడ్డి,మౌళాళి,ఆంథోనమ్మ,చంద్రశేఖర్‌రెడ్డి,చంద్రశేఖర్, రాజ్‌కుమార్ రెడ్డి,సుందరయ్య పూర్వ విద్యార్థులు సన్మానించి ఆశీర్వాదాలుతీసుకున్నారు. అనంతరం దివంగతులైన ఉపాధ్యాయులు సురేష్వర్మ, నారాయణమ్మ,విద్యార్థులు స్వాతి,మీనాకుమారి, లక్ష్మిరెడ్డి,బయన్నల ఆత్మకు శాంతికలగాలని రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులర్పించారు.

# ముళ్ల పొదలు తొలగింపు - కమీషనర్ రవీంద్రబాబు



పనులను పరిశీలిస్తున్న కమీషనర్

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ ః** జొహరాపురం సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న కమ్యూనిటీ భవనాల ప్రాంగణంలో ముళ్ల పొదల తొలగింపు వేగవంతం చేసినట్లు నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం ఆయన కమ్యూనిటీ భవనాల వద్ద జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ఐదేళ్ల క్రితం వివిధ కులాలకు సంబంధించి 18కమ్యూనిటీ భవనాలు నిర్మించగా ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయన్నారు. దీనిపై ఈ నెల 6న నగరపాలక అధికారులతో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ నిర్వహించిన సమీక్షలో చర్చ జరిగిందని, ఇందిరమ్మ కాలనీ కమ్యూనిటీ భవనాలను ప్రజలు తిరిగి ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారని పేర్కొన్నారు. అందులో భాగంగా ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టామని రెండ్రోజుల్లో పనులను పూర్తి చేస్తామని కమీషనర్ వెల్లడించారు. కమీషనర్ వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, శానిటేషన్ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి విడుదల రజినిపై పోలీసుల ప్రవర్తన బాధాకరం

**ః- వైకాపా జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్వి మోహన్‌రెడ్డి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ ః** మాజీ మంత్రి విడుదల రజినిపై పోలీసుల ప్రవర్తన తీరు బాధాకరమని వైకాపా జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్వి కాంప్లెక్స్ లోని కాన్ఫరెన్స్ హాల్ నందు మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్‌రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవం కాపాడుతామని చెప్పిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండ పోతుందన్నారు. సంక్షేమ పథకాలు ఇవ్వాలని ప్రశ్నించిన వ్యక్తులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సినీ నటుడు పోసాని కృష్ణ మురళీపై 16అక్రమ కేసులు నమోదు చేసి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాను తిప్పి కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. సిఐ సుబ్బరాయుడుపై చర్యలు తీసుకోవాలని ఆయన పోలీస్ డిపార్ట్‌మెంట్‌కు చెడ్డపేరు తీసుకొచ్చారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# అగ్ని ప్రమాదంలో మూడు గడ్డివాములు దగ్ధం

**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాద సంఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన లక్కసాగరం రాముడుకు చెందిన మూడు గడ్డివాములు దగ్ధమైయ్యాయి. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే ఆ గ్రామస్తులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే మూడు గడ్డివాములు కాలీ బుడిదైయ్యాయి.



# ఫుట్‌పాత్ ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు



**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** సంత మార్కెట్లో ఫుట్ పాత్‌ను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ మున్సిపాలిటీ ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి హెచ్చరించారు. ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్ కిషోర్ ఆదేశాల మేరకు ఆదివారం సంత మార్కెట్లో తనిఖీలు నిర్వహించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కూరగాయల వ్యాపారులను వెంటనే ఖాళీ చేయించారు. మళ్లీ ఇదే విధంగా కొనసాగితే జరిమానాలు విధించిచర్యలుతీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# రాయలసీమకు న్యాయం జరిగింది

**ః- రిటైర్డ్ డిఎస్పీ మహబూబ్ బాషా**



డా. చంద్రశేఖర్‌ను సన్మానించిన రిటైర్డ్ డిఎస్పీ మహబూబ్ బాషా

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** సీనియర్ కార్డియాలజిస్ట్, ప్రభుత్వ ఆసుప్రతి కార్డియాలజి విభాగాధిపతి డా. చంద్రశేఖర్‌కు ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సెలర్ పదవి దక్కడంతో రాయలసీమ ప్రాంతానికి న్యాయం జరిగిందని రిటైర్డ్ డిఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. రిటైర్డ్ డిఎస్పీ మహబూబ్ బాషా ఆదివారం డా. చంద్రశేఖర్‌ను ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ డా. చంద్రశేఖర్ పరిపాలనాదక్షతను గుర్తించే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయనను హెల్త్ యూనివర్సిటీ విసీగా ఎంపిక చేశారన్నారు. డా. చంద్రశేఖర్ ఆద్వర్యంలో హెల్త్ యూనివర్సిటీ మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేత రుస్తుం ఖాన్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామ్మోహన్ రెడ్డి, వేగా ఫౌండేషన్ అధ్యక్షుడు బోరెల్లి వెంకట రాముడు, సభ్యులు నాగేశ్వరబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలి

**ః- జిల్లా ఇంఛార్జ్ ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా**



కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సత్ప్రవర్తనతో జీవించాలని జిల్లా ఇంచార్జ్ ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా అన్నారు. జిల్లా ఇంచార్జ్ ఎస్పీ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆదివారం పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, నేరచరిత్ర గల వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పేకాటరాయుళ్ళు అరెస్ట్

**రూ.1540 నగదు 52పేకా ముక్కలు స్వాధీనం**

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామ శివారు హైస్కూల్ పరిసర ప్రాంతంలో పేకాట ఆడుతున్న పోలకల్ గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. పక్క సమాచారంతో ఎస్ఐ పరమేష్ నాయక్ తన సిబ్బందితో పేకాట స్థావరం పై దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్దనుండి రూ.1540 నగదు 52పేకా ముక్కలు స్వాధీనం చేసుకొని పేకాట ఆడుతూ పట్టుబడిన అరుగురుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు.

# ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తాం..భూమా

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని కూటమి ప్రభుత్వ హయాంలో 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామని ఆళ్లగడ్డ టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కేవీ సుబ్బారెడ్డి కళాశాలలో ఆదివారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో.. దేశ్ పాండే, నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని భూమా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో భూమా మాట్లాడుతూ ఆళ్లగడ్డలో ప్రస్తుతం ఉన్న 50 పడకల ఆసుపత్రి స్థాయిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి రోగులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో రోగులకు తగినన్ని వైద్య సేవలు అందుబాటులో లేవని తమ దృష్టికి వచ్చిందన్నారు. భవిష్యత్తులో కార్పొరేట్ హాస్పిటల్స్ కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేసి వైద్యం కోసం రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేకుండా కృషి చేస్తామన్నారు. నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్ యాజమాన్యం వారు కోవిడ్ సమయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఆళ్లగడ్డ నుంచి వచ్చిన రోగులకు ఆక్సిజన్, బెడ్ వంటి వసతులు కల్పించి చక్కని వైద్య సేవలు అందించి ఎందరో ప్రాణాలను కాపాడారని భూమా విఖ్యాత్ రెడ్డి కొనియాడారు. ఇన్నర్ వీల్ ఆధ్వర్యంలో ప్రత్యేక డాక్టర్ల బృందం ఇక్కడికి రావడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యుల సేవలను ఆళ్లగడ్డ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భూమా విజ్ఞప్తి చేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ ఉషారాణి మాట్లాడుతూ తమ విజ్ఞప్తిని మన్నించి ఆళ్లగడ్డలో మెగా వైద్య శిబిరం ఏర్పాటుకు విచ్చేసిన శాంతిరామ్ హాస్పిటల్ సైక్రియాట్రిక్ స్పెషలిస్ట్ డాక్టర్ సింధుజ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాతృ దినోత్సవ సందర్భంగా తల్లులందరికీ ప్రెసిడెంట్ ఉషారాణి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు,సిబ్బందికి చక్కని భోజన సౌకర్యం కల్పించిన ఎలక్ట్రికల్ ఏ.డి.ఈ రవికాంత్ చౌదరి తదితరులకు ఉషారాణి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల పాకిస్తాన్ యుద్ధంలో మరణించిన వీర జవాన్ మురళి నాయక్ మృతి పట్ల సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భూమా శ్రీనివాసరెడ్డి, డా .విష్ణువర్ధన్, తదితర స్పెషలిస్ట్ డాక్టర్ల బృందం, ఇన్నర్ వీల్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ టీఎంసీ గాయత్రీ దేవి, టీఎస్ విజయ, సరోజ, విజయలక్ష్మి, మాధవి, శ్రీదేవి,కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.





# కురుమల ఆరాధ్యదైవం మల్లెందొడ్డప్ప స్వామి

**-గొల్లలదొడ్డి మల్లెందొడ్డి స్వామి దేవర ఉత్సవాలు**



ఉత్సవలకు ముస్తాబైన శ్రీ శ్రీ శ్రీ బీరప్పస్వామి

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి గ్రామంలో ఆదివారం నుండి శ్రీశ్రీశ్రీ భీరలింగేశ్వర మల్లెందొడ్డప్ప స్వామి దేవర మహొత్సవాలు ప్రారంభమయ్యాయని గురువు బసవరాజ స్వామి తెలిపారు. మల్లెందొడ్డి స్వామి దేవర ఉత్సవలను మూడు రోజుల పాటు అంగరంగవైభంగా నిర్వహిస్తారని ఉత్సవలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. అందులో భాగంగా ఆదివారం గణపతి పూజ, పల్లకి గంగపూజను వైభవంగా నిర్వహించారు. సోమవారం రోజున భక్తుల నడుమ పల్లకి ఊరేగింపు, మంగళవారం అనురాధ నక్షత్రం రోజున పటం ఎక్కుట కార్యక్రమాలు జరుగులాగున వేదమూర్తులు నిర్ణయించారని, కావున ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు మరియు చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఉత్సవలలో పాల్గొని, కోరికలు మరియు ముడుపులు సమర్పించి శ్రీశ్రీశ్రీ మల్లందొడ్డప్ప స్వామి వారి కృపకు పాత్రులగుదురని తెలిపారు.

# సలకలకొండలో స్వచ్ఛ ఆంధ్ర..స్వచ్ఛ భారత్

**– సీఎం అడుగుజాడల్లో నడుస్తాం**
**– రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ**



స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న కృష్ణమ్మ

**ఆదోని, మేజర్‌న్యూస్ :** సీఎం చంద్రబాబు అడుగుజాడల్లో నడుస్తామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ పేర్కొన్నారు. ఆదివారం ఆదోని మండల పరిధిలోని సలకలకొండ గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కృష్ణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించిన కూడ తాగునీటి సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదని వాపోయారు. డ్రైనేజీ వ్యవస్థ కూడ చాలా అస్తవ్యస్తంగా ఉందని, ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీలు క్లీన్ చేయకుండా, గ్రామాల్లో పరిశుభ్రత అనేది కంటికి కనిపించడం లేదు, చాలామంది పెన్షన్లు రావడం లేదని కూడ కృష్ణమ్మ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కపటి మాజీ సర్పంచ్ మాధవ్, బైచిగేరి ఓంకార్, సలకలకొండ గ్రామ నాయకులు సీతారాం, ఈరన్న, శంకరన్న, మునెప్ప, పూజారి వెంకట రాముడు, ఖాసీం, సుంకన్న, గణేకల్లు లక్ష్మన్న, మహాదేవ్, ఈరన్న, సుంకన్న, ఎంకప్ప, సవరప్ప, తిమ్మప్ప, రాఘవరెడ్డి, భరత్ కుమార్, ఎల్‌బిస్ట్రీట్ వెంకట నారాయణ, చిట్టి, బసవరాజ్, మండిగిరి బాబురావు, పాండవగల్లు ఆళ్లప్ప, మల్లికార్జున, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో మార్కులు సాధించడం అభినందనీయం

**– మంత్రి ఎన్ఎండి ఫరూక్**




గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న మంత్రి

**నంద్యాల అర్బన్, మేజర్ న్యూస్ :** నంద్యాల గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 10వ తరగతిలో 597 మార్కులు సాధించడం అభినందనీయమని రాష్ట్ర న్యాయ శాఖ, మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ గోడపత్రికలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురురాజ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# చింతకుంటలో మూతవేసిన చలివేంద్రం..

**చలివేంద్రం పేరిట నిధులు జేబులోకి...**




**హాలహర్వి, మేజర్ న్యూస్ :** హాలహర్వి మండలంలోని చింతకుంట గ్రామంలో సర్పంచ్ సద్దాం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసుల ఆధ్వర్యంలో గత నెలలో ఏర్పాటు చేసిన చలివేంద్రం పట్టుమని పది రోజులు కూడా పెట్టకుండా మూతవేశారు.వేసవి కాలం ప్రయాణికులకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేసినచలివేంద్రంలో మట్టి కుండలు లేకుండా కేవలం చూడడానికి షెడ్ మాత్రమే ఉంచి చలివేంద్రం పేరిట మాత్రం నిధులు జేబులోకి నింపుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. బళ్లారి,కర్నూలు జిల్లాల సరిహద్దులో ఉన్న చింతకుంట గ్రామంలో జనాభా అధికంగా ఉందిపక్కన మాజారా గ్రామం శిరిగాపురం నుండి సచివాలయ పనుల నిమిత్తం చింతకుంట వచ్చి వెళ్తుంటారు. అటు వంటి వారికోసం పంచాయతీ అధికారులు,సర్పంచ్ చలివేంద్రం ఏర్పాటు చేసి ముచ్చటగా మూడు రోజులు పెట్టి ఎత్తివేశారు. దీంతో చుట్టుపక్కల గ్రామస్థులు చింతకుంట కు వస్తే మంచినీళ్లు లేకుండా అయ్యాయని వేసవిలో డబ్బులు పెట్టి నీటిని తాగాల్సి వస్తుందని రైతులు ఆరోపించారు. కావున మండల అధికారులు సంబంధిత అధికారులు, సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

# టిడిపి బలోపేతానికి కృషి చేయాలి

**ఏపిఎస్ఎస్‌డిసిఎల్ ఛైర్మెన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి**

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** తెలుగుదేశం పార్టీని రాష్ట్రంలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ధర్మవరం మన్నె సుబ్బారెడ్డిని ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల పరిశీలకులుగా నియమించడం ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు తిక్కారెడ్డిలు కలిసి ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడిని ఆదివారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆదోని నియోజకవర్గంలో పార్టీ బలోపేతం గురించి, కమిటీలు పూర్తి చేయాలనే విషయంపై చర్చించుకున్నారు.

**మంత్రాలయం టిడిపి ఇంచార్జ్ ఎన్.రాఘువేంద్రారెడ్డిని కలిసిన ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి :** మంత్రాలయ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ ఎన్.రాఘువేంద్రారెడ్డిని ఆంధ్రప్రదేశ్



మీనాక్షినాయుడిని కలిసిన ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, తిక్కారెడ్డిలు

రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ఆదివారం మంత్రాలయంలోని ఆయన కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మంత్రాలయం నియోజకవర్గం సంబందించిన అన్ని కమిటీలు త్వరగా పూర్తి చేయాలని చర్చించుకున్నారు.

# స్టేట్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన భార్గవ రాయల్ స్కూల్ విద్యార్థి



విజయసంకేతంతో భార్గవ రాయల్ స్కూల్ యాజమాన్యం

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలంలోని భార్గవ రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి యు.ప్రజ్వాల్ అశ్విత్ అంబేద్కర్ గురుకుల ప్రవేశ పరీక్షలో స్టేట్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆదివారం భార్గవ రాయల్ స్కూల్ కరస్పాండెంట్ ఎ. వెంకటస్వామి ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కరస్పాండెంట్ మాట్లాడుతూ మండలంలో 2017 సంవత్సరంలో భార్గవ రాయల్ గురుకుల కోచింగ్ సెంటర్ తో ప్రారంభమై మొదటి సంవత్సరంలో 16గురుకుల 2నవోదయ సిట్లు సాధించి అంచలంచేలుగా ఎదిగి నేడు భార్గవ రాయల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ గా రూపంతరం చెంది త్వరలో భార్గవ రాయల్ స్కూల్ హైస్కూల్‌గా రూపు దిద్దుకొంటుంటుంది. మండలంలో ఈఘనత సాధించిన మొదటి స్కూల్ భార్గవ రాయల్ స్కూల్ అని చెప్పడంలో గర్వంగా ఉందన్నారు. ఈ సంవత్సరం అంబేద్కర్ గురుకుల ప్రవేశ పరీక్ష లో మా స్కూల్ విద్యార్థి యు. ప్రజ్వాల్ అశ్విత్ స్టేట్ ర్యాంక్ లో 31స్థానం జెండర్ ర్యాంక్ 16స్థానం మండలంలో మొదటి ర్యాంక్ సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకోచ్చిన ప్రజ్వాల్ అశ్విత్‌కు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ద వహించి ఉన్నతంగా తీర్చిద్దిన పాఠశాల అధ్యాకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ముమ్ముందు పాఠశాల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధించే విద్యార్థుల బంగారు భవిషత్తు కు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

# బస్టాండ్, రైల్వేస్టేషన్‌లలో ఆకస్మిక తనిఖీలు

**– బస్టాండు, రైల్వేస్టేషన్‌ను తనిఖీలు చేసిన పోలీసులు**

**కోసిగి మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన కోసిగిలో అకస్మిక తనిఖీలు ఆదివారం చేపట్టారు. సిఐ మంజునాథ్, యస్ఐ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో ఈ తనిఖీలను చేపట్టారు. బస్టాండ్, రైల్వేస్టేషన్‌తోపాటు అనుమానస్పద ప్రదేశాలలో తనిఖీలు చేపట్టడం జరిగింది. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ అకస్మిక తనిఖీలు చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. ఇప్పటికే భారత్-పాకిస్తాన్‌ల మధ్య యుద్ధం ప్రారంభమై ముగిసిందని దానిలో భాగంగానే ఈ తనిఖీలను చేపట్టడం జరుగుందన్నారు. అలాగే ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినా.. పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు సూచించారు.



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపడుతున్న సిఐ, యస్ఐ

# ఘనంగా శ్రీ మూల పెద్దమ్మ తల్లికి ముడుపు కట్టే కార్యక్రమం

**దొర్నిపాడు, మేజర్ న్యూస్ :** మండలంలోని డబ్బ్యా గోవిందిన్నె గ్రామంలో వచ్చే నెలలో 8,9,10,వ తేదీలలో జరిగే శ్రీ మూల పెద్దమ్మ తల్లి దేవరకు ముందుగా పెద్దమ్మ కు ముడుపు కట్టే కార్యక్రమం పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు, తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, మిద్దె చిన్నన్న, కే చిన్న పెద్దన్న లు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి టిడిపి యువనాయకుడు భూమా జగత్ విఖ్యత్ రెడ్డి మరియు టిడిపి నాయకులు భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా సందీప్ రెడ్డి, భూమాసంతోష్‌రెడ్డిలు హాజరయ్యారు ముడుపు కట్టే కార్యక్రమంలో గ్రామప్రజలు పెద్దఎత్తునపాల్గొన్నారు.పెద్దమ్మ తల్లి ఆలయం నుండి గ్రామంలోని కర్నాటి కృష్ణారెడ్డి ఇంటి దగ్గరకు వెళ్లి అక్కడనుండి పెద్ద ఎత్తున ఊరేగింపు గా ముడుపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది అనంతరం టిడిపి యువనాయకుడు భూమా జగత్ విఖ్యత్ రెడ్డి శ్రీమూల పెద్దమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, మిద్దె చిన్నన్న, కే.చిన్న పెద్దన్నలు మాట్లాడుతూ ఈ రోజు నుండి21 రోజుల పాటు గ్రామంలోఎలాంటిశుభాకార్యాలు నిర్వహించడం జరగదని వారు తెలిపారు జూన్ నెల, 8,9,10,వ తేదీలలో జరిగే శ్రీ మూల పెద్దమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించడం జరుగుతుంది అని కాబట్టి ప్రజలు జాతరలో పాల్గొని పెద్దమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.టిడిపి నాయకులు భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా జగత్ విఖ్యత్‌రెడ్డి, భూమా సందీప్ రెడ్డి, భూమా సంతోష్ రెడ్డి, డిసి చైర్మన్ ఎరువా ప్రసాద్ రెడ్డి, నరెద్దుల మహేశ్వర రెడ్డి,ఎస్ ఐ, సత్యనారాయణ కర్నాటి కృష్ణరెడ్డి, జి, కృష్ణా రెడ్డి, సిద్ది సత్యనారాయణ, డిసి వైస్ చైర్మన్ లింగుట్లవెంకట నాయు డు, రమణయ్య, విశ్వనాధరెడ్డి, కమిటీ సభ్యులు, తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య మిద్దె చిన్నన్న, కే, చిన్న పెద్దన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న జగత్ విఖ్యత్ రెడ్డి, గ్రామ ప్రజలు



కార్యక్రమంలో పాల్గొన్న,భూమా జగత్ విఖ్యత్ రెడ్డి ,భూమా బ్రహ్మానందరెడ్డి, సందీప్ రెడ్డి, సంతోష్ రెడ్డి

# ఎకానమి

## APPSC, TGPSC గ్రూప్-1, 2 JL, DL

1. గ్రామీణాభివృద్ధికి సంబంధించి క్రింది వానిలో సరైనది గుర్తించుము.

ఎ. చిన్న రైతుల అభివృద్ధి సంస్థ (యస్ఎఫ్‌డిఏ) 1969లో స్థాపించబడినది.

బి. ఉపాంత రైతులు మరియు వ్యవసాయ కార్మికుల అభివృద్ధి సంస్థ (ఎమ్ఎఫ్ఎఎల్‌డిఎ) 1968లో స్థాపించబడినది.

1. ఎ మాత్రమే సరైనది
2. 'బి' మాత్రమే సరైనది  3. ఎ,బి రెండూ
4. ఏవీ కావు.

జవాబు : 4

2. ఎడారి అభివృద్ధి పథకం ఏ సంవత్సరంలో ప్రారంభించబడినది?

ఎ. 1977-78  బి. 1980-81
సి. 1972-73  డి. 2001-02

జవాబు : ఎ

3. దుర్భిక్ష పీడిత ప్రాంతాల (కరువు పీడిత) కార్యక్రమం ఎపుడు ప్రారంభించబడినది?

ఎ. 1973-74  బి. 1983-84
సి. 1993-94  డి. 2001-02

జవాబు : ఎ

4. ఇటీవల ఏ రోజును 'ఎడారీకరణ మరియు కరువును' ఎదుర్కొనటానికి ప్రపంచ దినోత్సవాన్ని జరుపు కున్నారు?

ఎ. మార్చి 17  బి. జూన్ 17
సి. సెప్టెంబరు 17  డి. జులై 28

జవాబు : బి

5. కరువు పీడిత ప్రాంతాల కార్యక్రమానికి సంబంధించి సరైన అంశాన్ని గుర్తించుము.

ఎ. పంటలు మరియు పశువుల ఉత్పత్తి, భూమి, నీరు మరియు మానవ వనరుల ఉత్పాదకతపై కరువు యొక్క ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడం.

బి. మెరుగైన పంట నిర్వహణ, సాంకేతికతల ద్వారా వ్యవసాయ యోగ్యమైన భూములను సమర్ధ వంతముగా ఉపయోగించడంపై దృష్టి సారించడం.

సి. భారతదేశంలో క్షీణించిన భూ విస్తీర్ణం 105 మిలియన్ హెక్టార్లు అనగా దేశ విస్తీర్ణంలో దాదాపు 32%గా ఉంది.

డి. కరువు పీడిత ప్రాంతాల ప్రజలకు ఉపాధి మరియు ఉత్పాదక ఆస్తులసృష్టి కోసం 4వ ప్రణాళికలో ఈ పథకం ప్రారంభమైనది.

ఇ. పైవన్నీ సరైనవే.

జవాబు : ఇ

6. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఎవరి పుట్టిన రోజున ప్రారంభించబడినది?

ఎ. సర్దార్ పటేల్  బి. మహాత్మాగాంధీ
సి. సుభాష్ చంద్రబోస్  డి. నెహ్రూ

జవాబు : బి

7. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సంబంధించి సరైన అంశాన్ని గుర్తించుము.

ఎ. ఈ పథకం 2005 ఆగష్టు 23న మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో రూపొందించబడినది.

బి. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యంలేని కార్మికులకు సంవత్సరానికి 100 రోజుల వేతన ఉపాధికి హామీ ఇస్తుంది.

సి. 2006, ఫిబ్రవరి 2న ఈ పథకం ఎ.పి.లోని అనంతపురంలో ప్రారంభమైనది.

డి. ఈ పథకం ప్రారంభంలో అత్యంత పేదరికంలో ఉన్న 200 జిల్లాలను కవర్ చేయగా క్రమంగా దేశవ్యాప్తంగా 626 జిల్లాలకు విస్తరించబడింది.

1. ఎ,బి,సి,డి సరైనవి  2. సి,డి మాత్రమే
3. ఎ,సి,డి మాత్రమే  4. సి మాత్రమే

జవాబు : 1

8. ఉపాధి హామీ పథకంను మొదట ఏ రాష్ట్రంలో ప్రవేశపెట్టారు?

ఎ. ఉత్తరప్రదేశ్  బి. హర్యానా
సి. మహారాష్ట్ర  డి. అరుణాచల్‌ప్రదేశ్

జవాబు : సి



### పేదరికం - ప్రాక్టీస్ బిట్స్

9. 2015 సంవత్సరంలో యువతకు నైపుణ్య శిక్షణను అందించడానికి ఏ పథకాన్ని ప్రారంభించారు?

ఎ. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
బి. స్కిల్ డెవలప్‌మెంట్ యోజన
సి. దీన దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన
డి. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన

జవాబు : డి

10. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకం ప్రధానంగా ఏ వ్యక్తుల సమూహాన్ని లక్ష్యంగా చేసుకుంది?

ఎ. గ్రామీణయువత  బి. పట్టణ యువత
సి. మహిళా పారిశ్రామికవేత్తలు
డి. సీనియర్ సిటిజన్ల పెన్షన్‌కు సంబంధించినది.

జవాబు : ఎ

11. అసంఘటిత రంగంలో యువతకు ఉపాధిని కల్పించడానికి ప్రారంభించిన పథకం ఏమిటి?

ఎ. ప్రధానమంత్రి ఆవాస్ యోజన
బి. స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్
సి. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్
డి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం

జవాబు : సి

12. స్టార్టప్ ఇండియా చొరవ యొక్క ప్రాథమిక ఉద్దేశ్యం

ఎ. స్టార్టప్‌లకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించడం
బి. ఉపాధి కల్పనను సులభతరం చేయడం
సి. విద్య యొక్క నాణ్యతను పెంపొందించడం
డి. గ్రామీణ యువతలో నైపుణ్యాలను పెంచడం

జవాబు : ఎ



ఎం.అన్నారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ
హనుమకొండ.

# డియస్సీ టెట్ ప్రత్యేకం జాగ్రఫీ



### మా ఊరు - మా చెరువు

1. పిచోలా సరస్సును నిర్మించినది

1. బంజారాలు మహారాజా ఉదయ్‌సింగ్
2. బంజారాలు, మహారాజా రంజిత్ సింగ్
3. పటేలియాలు, మహారాజా రంజిత్ సింగ్
4. పటేలియాలు, మహారాజా ఉదయ్‌సింగ్

2. ఉదయసముద్రం అని ఏ చెరువును పిలుస్తారు?

1. రామప్ప చెరువు  2. పాకాల్లు చెరువు
3. ఉదయ్‌పూర్ చెరువు  4. హుస్సేన్ సాగర్

3. క్రింది వానిలో సరియైన అంశాలను గుర్తించండి?

ఎ.ఉదయపూర్ నగరాన్ని సరస్సుల నగరం అంటారు.
బి.ఉదయ్‌పూర్ రాజభవనాలన్నీ సరస్సుల ఒడ్డున నిర్మించారు.
సి. ఉదయ్‌పూర్‌లో ప్రముఖ సరస్సు 'పిచోలా'
డి. ఉదయ్‌పూర్ సరస్సు రాజస్థాన్‌లో ఉన్నది.

1. ఎ మరియు బి  2. బి మరియు సి
3. ఎ,బి మరియు సి  4. ఎ,బి,సి మరియు డి

4. హుస్సేన్‌సాగర్ పై ట్యాంక్‌బండ్ నిర్మించిన సంవత్సరం?

1. 1936  2. 1948  3. 1946  4. 1943

5. రాష్ట్రవ్యాప్తంగా ఎండిపోయిన చెరువుల పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం ఏ పేరుతో చేస్తున్నది?

1. మిషన్ కాకతీయ  2. మిషన్ భగీరథ
3. మిషన్ హరిత  4. మిషన్ ఇంద్రధనుస్సు

6. హుస్సేన్ సాగర్ గురించి సరైన అంశాలను గుర్తించండి?

ఎ. దీనిని 1562లో హజ్రత్ హుస్సేన్ షావలి నిర్మించాడు.
బి. దీనినే ట్యాంక్ బండ్ అంటారు.
సి.ఈ చెరువు గుర్రపు డెక్కల ఆకుతో నిండిపోయింది.
డి. హైదరాబాదు, సికిందరాబాదు నగరాలను కలుపుతూ ఉన్న దాని కట్టను 1946లో పెద్ద రోడ్డుగా మార్చారు.

1. ఎ మరియు బి  2. బి మరియు సి
3. ఎ,బి మరియు ు  4. ఎ,బి,సి మరియు డి

7. పిచోలా సరస్సు ఈ నగరంలో ముఖ్యమైన సరస్సు

1. జోద్‌పూర్  2. ఉదయ్‌పూర్
3. జైపూర్  4. భరత్‌పూర్

8. క్రింది వాటిని జతపరుచుము

1. రామప్ప చెరువు  ఎ. గండిపేట చెరువు
2. పాకాల్లు చెరువు  బి. ట్యాంక్ బండ్
3. హుస్సేన్ సాగర్  సి. ఉదయ సముద్రం
4. ఉస్మాన్ సాగర్  డి. మానవ నిర్మితమైనది.

1. 1-ఎ,2-బి,3-సి,4-డి
2. 1-సి,2-డి,3-ఎ,4-బి
3. 1-డి,2-సి,3-బి,4-ఎ
4. 1-బి,2-డి,3-సి,4-ఎ

9. క్రింది వానిలో సరికాని అంశాన్ని గుర్తించండి.

1. పాకాల్లు చెరువు నల్గొండ జిల్లాలో ఉంది.
2. ఉస్మాన్ సాగర్ మూసీనది ఉపనదిపైన ఉన్నది.
3. రామప్ప చెరువు 13వ శతాబ్దంలో నిర్మించారు.
4. హుస్సేన్ సాగర్‌నే గండిపేట చెరువు అని అంటారు.

10. కాకతీయులు, నిజాం రాజులు ఎలాంటి చెరువులు నిర్మించారు?

1. గొలుసుకట్టు చెరువులు
2. ఆయువుకట్టు చెరువులు
3. తూముకట్టు చెరువులు  4. మత్తడి చెరువులు

11. చెక్ డ్యామ్‌లు

1. వాటర్ షెడ్ పథకంలో భాగం కాదు
2. భూగర్భజలం పెంచుట కొరకు ఉద్దేశించబడినవి.
3. భారీ నీటి పారుదలకు ఉద్దేశించబడినవి
4. బహుళార్థ సాధక పథకాలు

12. తెలంగాణ అంతటా గొలుసుకట్టు చెరువులు నిర్మించిన వారు ఎవరు?

1. రెడ్డిరాజు  2. వెలమ రాజులు
3. నిజాం రాజులు  4. చాళుక్యులు

13. రామప్ప చెరువు గురించి సరికాని వాక్యాన్ని గుర్తించండి.

1. రామప్ప చెరువు జయశంకర్ జిల్లాలో కలదు.
2. రామప్ప చెరువు విస్తీర్ణం 24 చ.కి.మీ.
3. రామప్ప చెరువు మానవ నిర్మిత చెరువు
4. రామప్ప చెరువును 12వ శతాబ్దంలో నిర్మించారు.

14. హుస్సేన్ సాగర్‌ను కుతుబ్‌షాహి పాలకులు ఏ సంవత్సరంలో నిర్మించారు?

1. 1560  2. 1561
3. 1562  4. 1572

15. పాకాల్లు చెరువు గురించి సరికాని వాక్యాన్ని గుర్తించండి.

1. పాకాల్లు చెరువు నల్గొండ జిల్లాలో కలదు.
2. పాకాల్లు చెరువు మరొక పేరు ఉదయ నక్షత్రం
3. పాకాల్లు చెరువును నిర్మించిన వారు కాకతీయ ప్రతాపరుద్రుడు
4. పాకాల్లు చెరువుకు సమీపంలో ఛాయ సోమేశ్వరాలయం కలదు.

**జవాబులు :**

1)1, 2)2, 3)4, 4)3, 5)1, 6)4, 7)2, 8)3, 9)4, 10)1, 11)2, 12)3, 13)4, 14)3, 15)2



పాదం సుధాకర్
ఫ్యాకల్టీ

# హోరాహోరీగా ఎడ్లబండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ ః** శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవ స్వామి బ్రహోత్సవాల సందర్భంగా ఓర్వకల్ మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 6పళ్ల విభాగపు ఎడ్ల బండలాగుడు పోటీలు ఆదివారం హోరాహోరీగా సాగాయి. టిడిపి నాయకులు గోవిందరెడ్డి, కమిటీ సభ్యులు ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో 11 జతల వృషభాలు పాల్గొన్నాయి. కర్నూలు జిల్లా కర్నూలు మండలం బి తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆకెపోగు వరలక్ష్మి వృషభాలు 4750అడుగుల దూరాన్ని లాగి మొదటిస్థానంలో నిలిచి రూ.50 వేలు, గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంకిపాడు గ్రామానికి చెందిన ఆంజనేయ రెడ్డి వృషభాలు 4504.5అడుగులు లాగి రెండవ స్థానంలో నిలిచి రూ.40వేలు, కర్నూలు జిల్లా పెద్దకోటల గ్రామం, ఎమ్మిగనూరు మండలం దైవం దిన్నె గ్రామానికి చెందిన బోరెడ్డి నారాయణరెడ్డిల ఉమ్మడి జత 4500అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచి రూ.30వేలు, వీరేష్‌గౌడ్, సాబువర్ధన్‌ల ఉమ్మడి జత 4434అడుగులు లాగి నాల్గో స్థానంలో నిలిచి రూ.20వేలు, అక్షరారెడ్డి వృషభాలు 4384.6అడుగులు లాగి ఐదవ స్థానంలో నిలిచి రూ.10వేలు, జెసిఎస్‌ఆర్ బుల్స్ 4357.6 అడుగులు లాగి ఆరవ స్థానంలో నిలిచి రూ.5వేలు నగదును గెలుచుకున్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు దాతల సహకారంతో వరుసగా ఆరు బహుమతులు అందచేశారు. ఈ పోటీలకు వ్యాఖ్యాతగా వాడల రామనాయుడు వ్యవహరించారు. ఈ పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలతో పాటు గ్రామంలోని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన మార్క్‌ఫ్రెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి స్వగృహంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మరియు మార్క్‌ఫ్రెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆదివారం కలిశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న తులసి రెడ్డి టీడీపీ అధిష్టానం మడకసిర నియోజకవర్గానికి పరిశీలకులుగా నియమించింది. ఆ ఎన్నికల్లో కూటమి నుంచి తెదేపా అభ్యర్థిగా పార్టీ అధిష్టానం పయ్యావుల కేశవ్‌ను ఎన్నికల బరిలో నిలిపింది. పార్టీ పరిశీలకులుగా బాధ్యతలు తీసుకున్న తాతిరెడ్డి తులసి రెడ్డి పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా పూర్తి చేసి పయ్యావుల కేశవ్ విజయంలో కీలక పాత్ర పోషించారు. తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తరపున తులసి రెడ్డిని ఏపీ మార్క్‌ఫ్రెడ్ డైరెక్టర్‌గా నియమించారు. మంత్రి, ఎమ్మెల్యేను కలుసుకున్న తులసి రెడ్డి తన స్వగ్రామం



మంత్రి, ఎమ్మెల్యేతో తెదేపా నాయకులు

ఎన్.కొత్తపల్లిలో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో జరుగనున్న శ్రీ భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయం మూడవ వార్షికోత్సవ వేడుకలకు ఆహ్వాన పత్రికను అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ః– నన్నూరులో ఘనంగా చర్చి ప్రారంభోత్సవం



**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ ః** మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో కొత్తగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి ప్రారంభించారు. ముందుగా గ్రామంలో నిర్మించిన ఏబిఎం తెలుగు బాప్టిస్ట్ చర్చిని రెవరెండ్ పాస్టర్ బీషప్ బిడి ప్రసాదరావు, పాస్టర్లు ప్రసాద్, నాగరాజులు నూతన చర్చిని ప్రారంభించారు. సాయంత్రం ఎమ్మెల్యే చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కబడ్డీ పోటీలను ప్రారంభిస్తూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీలను ఆడాలని క్రీడా కారులకు తెలిపారు. క్రీడలు శారీరక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయ న్నారు. గ్రామ నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి, విజయుడు, ఖాజామియ్య, సర్కార్,శంషుద్దీన్,పట్టేలా,మోహన్, అయ్యన్న, గోపాల్, శీను గ్రామంలోని క్రైస్తవ సోదరులు, ప్రజలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌లాల్‌ను పరామర్శించిన ఎంపి

– ఎస్పీతో మాట్లాడిన బైరెడ్డి శబరి

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** కొద్ది రోజుల క్రితం జరిగిన హత్యాయత్నం ఘటనలో గాయపడిన కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌లాల్‌ను నంద్యాల ఎంపి బైరెడ్డి శబరి పరామర్శించారు. ఆదివార ం ఉదయం ఆమె శ్యామ్ ఇంటికి చేరుకొని ఆ రోజు జరిగిన ఘటనను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణాతో ఫోన్‌లో మాట్లాడారు. హత్యాయత్నం ఘటనలో కాలి వేళ్లకు తీవ్ర గాయాలైన విషయాన్ని ఆమె ఎస్పీ దృష్టికి తీసుకొని వెళ్లారు. ఒకటి రెండు రోజుల మరోసారి విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ చెప్పినట్లు ఆమె తెలిపారు. ఎంపిగా గెలిచిన తరువాత మొదటిసారిగా ఇంటికి వచ్చిన ఆమెను శ్యామ్‌సుందర్‌లాల్ మరియు కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఆలాగే ఆమెతో పాటు వచ్చిన కేంద్ర పుడ్‌కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన నరహరి విశ్వనాథ్‌రెడ్డిని శ్యామ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు బింగుమళ్ల శ్యామ్‌సుందర్‌గుప్తా, ఆజయ్, పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

**మంత్రిని కలిసిన ఎపియూడబ్ల్యూజే సభ్యులు :** రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్‌ను నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎపియూడబ్ల్యూజే సభ్యులు కలిసారు. కొద్ది రోజుల క్రితం జరిగిన ఘటనలో ఎపియూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖండే శ్యామ్ సుందర్‌లాల్ కు ఇప్పటికి వరకు న్యాయం జరగలేదని జిల్లా అధ్యక్షులు మధుబాబు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చలంబాబు, ప్రధాన కార్యదర్శి ఉస్మాన్‌బాషలు మంత్రికి వివరించారు. ఘటన



జరిగి రోజులు గడిచిపోతున్నా పోలీసులు న్యాయం చేయలేదని తెలిపారు. వెంకటేష్ బాబు అలియాస్ ఎటూ జెడ్ బాబు జరిపిన హత్యాయత్నంలో శ్యామ్ కాలి వేళ్లకు తీవ్ర గాయాలు అయినా గాయాలు కాలేదని కొందరు పోలీసులు వాఖ్యానిస్తున్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకొని వెళ్లారు. చివరికి వైద్యాధికారులపై వత్తిడి చేసి మెడికల్ సర్టిఫికేట్ పొందినట్లు కొందరు పోలీసులు ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. శ్యామ్‌కు తగిలిన గాయంపై మెడికల్ బోర్డుకు వెళ్లడానికి తాము సిద్దంగా ఉన్నామని మంత్రికి తెలిపారు. స్పందించిన మంత్రి వెంటనే సిఐతో మాట్లాడారు. ఆ తరువాత ఎస్పీతో మాట్లాడారు. రెండు రోజులు వేచి ఉండాలని మంత్రి సభ్యులకు సూచించారు. మరోసారి పోలీసులు ఉన్నతాధికారులతో మాట్లాడతానని తెలిపారు. రెండు రోజుల తరువాత న్యాయం జరగకపోతే న్యాయం కోసం మరోసారి కార్యాచరణ ప్రకటిస్తామని మంత్రికి తెలిపారు. తమ ఫిర్యాదులపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని కోరారు. శ్యామ్ ఘటనలో కోర్టును ఆశ్రయించే విషయమై న్యాయ నిపుణులుతో మాట్లాడుతున్న విషయాన్ని మంత్రికి వివరించారు.సీనియర్, జూనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సత్కరించిన సగర సంఘం



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** సగర విద్యార్థులు వివిధ పరీక్షల్లో విజయ శంఖారావం పూరించి ప్రభంజనం సృష్టించారని సగర (ఉప్పెర) జిల్లా అధ్యక్షులు సురేష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం భగీరథ సధన్ అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను, తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. మున్ముందు మరింత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ స్థానానికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు చిలకల మురళీ మోహన్, అసెంబ్లీ అధ్యక్షులు బాలాజీ, యువజన సంఘం అధ్యక్షులు హరికిరణ్, కుల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఉన్న పోలీసు స్టేషన్‌లలో పోలీసులు రౌడీ షీటర్లు, నేర చ రిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కౌన్సిలింగ్ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. రౌడీ షీటర్లు, నేర చ రిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో మెలగాలని పోలీసులు సూచించారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలికి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలిపారు. నిరంతరం మీపై నిఘా ఉంటుందని తెలిపారు. ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ప్యాసెంజర్ రైళ్ళను పునరుద్ధరించాలి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** కరోనా నేపథ్యంలో రద్దు అయిన ప్యాసెంజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని సిపిఐ ఆధ్వర్యంలో మంత్రి ఫరూక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ కర్నూలు నుంచి విజయవాడ, కోస్తా ప్రాంతాలకు నడుస్తున్న రైళ్లను కరోనా నేపథ్యంలో రద్దు చేశారని అన్నారు. నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా పునరుద్ధరించకపోవడంతో ఉద్యోగులు, చిరు వ్యాపారస్తులు, విద్యార్థులు, రైతులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. చర్యలు తీసుకోవాలని మంత్రికోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన వార్షిక జయంతి ఉత్సవాలు

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్ః** మండల పరిధిలోని కన్నపకుంట గ్రామంలో వెలసిన శ్రీశ్రీ లక్ష్మి మద్దిలేటిస్వామి వార్షిక జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఉత్సవాల్లో గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు బండలాగుడు పోటీలు నిర్వహించగా, రెండవ రోజు హోరాహోరీగా జరిగిన కబడ్డీ పోటీలలో నన్నూరు జట్టుపై గార్లదిన్నె జట్టు విజయం సాధించి మొదటి బహుమతి గెలుపొందింది. ఆయా కార్యక్రమాలలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ కన్నపకుంట మధుసూదన్‌రెడ్డి, రంగారెడ్డి, మైసూరారెడ్డి, విష్ణురెడ్డి, మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసిన రెడ్డి సంఘం సభ్యులు

**డోన్, మేజర్‌న్యూస్ః** వేసవితాపాన్ని దృష్టిలో ఉంచుకొని డోన్ రెడ్డి సామాజిక సేవా సంఘం ఆధ్వర్యం లో ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్ నందు డోన్ రెడ్డి సామాజి క సేవా సంఘం అధ్యక్షులు లక్ష్మి కాంతరెడ్డి, రెడ్డి దాతల సహాయ సహకారాలతో ప్రజలకు సభ్యులు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు లక్ష్మికాంతరెడ్డి మాట్లాడుతూ డోన్ రెడ్డి సమాజిక సేవా సంఘం మొదటి సంవత్సరం సందర్భంగా ప్రజలకు ఉచితంగా మజ్జిగను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే సామాజిక సేవలను ప్రజలకు అందించడంలో రెడ్డి సంఘం ఎళ్ళప్పుడు ముందుంటుందని, అందులో భాగంగానే ఎండల తీవ్రతను గమనించి, ప్రజలకు మజ్జిగను ఉచితంగా పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో డోన్ రెడ్డి సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవలు చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## బి.కోడూరులో పోలీసు కార్డెన్ సెర్చ్

**బండి ఆత్మకూరు రూరల్ మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు బి కోడూరు గ్రామంలో బండి ఆత్మకూర్ సబ్ ఇన్స్పెక్టర్ జగన్మోహన్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నివారణే లక్ష్యంగా కార్డెన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామున బి. కోడూరు గ్రామంలో మహానంది సబ్ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ ,గోస్పాడు సబ్ ఇన్స్పెక్టర్ వెంకటప్రసాద్ తో పాటు మరో 20 మంది సిబ్బందితో బృందాలుగా ఏర్పడి కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు ఎస్సై జగన్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా అనుమానితులు, రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు జరిపామని, సరైన ధ్రువపత్రాలు లేని 06 మోటర్ సైకిళ్లను మరియు 10 క్వాటర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.

సూర్య

సోమవారం | 12 మే 2025

# బుద్ధుని విగ్రహం ఆవిష్కరణ

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కల్లూరు రాఘవేంద్ర నగర్ పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ఆదివారం రాత్రి బుద్దుని విగ్రహావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపి టీజీ వెంకటేష్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, సెట్కూరు సిఈఓ వేణుగోపాల్, బ్రహ్మర్షి



హాజరైన ధ్యానులు

బీవీ రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త రవిరెడ్డి తదితరులు హాజర



మాట్లాడుతున్న మాజీ ఎంపి టీజీ వెంకటేష్

య్యారు. అనంతరం సభలో మాజీ ఎంపి టీజీ వెంకటేష్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డిలు మాట్లాడుతూ ధ్యాన కేంద్రంలో బుద్ద విగ్రహం ఏర్పాటు చేయడంతో ఇక్కడ ధ్యానం చేసుకునే భక్తులకు ప్రశాంతత లభిస్తుందన్నారు. బీవీ రెడ్డి ఆధ్యాత్మిక రంగంలో ఏర్పాటు చేసిన పిరమిడ్ జన కేంద్రం ఇవాల అందరికి ఆదర్శంగా మారిందన్నారు. బీవీ రెడ్డి స్వాగతం పలుకుతూ ధ్యానం మనసులో ధైర్యం, ఆలోచన శక్తిని పెంచుతుందన్నారు.

# శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దర్శించుకున్న నంద్యాల ఎంపీ శబరి



పూర్ణకుంభం తో స్వాగతం పలుకుతున్న ఆలయ ఈవో ,చైర్మన్

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలోని శ్రీలక్ష్మిచెన్న కేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆదివారం సాయంత్రం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వెంకటరామయ్య శర్మ సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆలయ ఈవో వెంకట రమణ ఆలయ కమిటీ చైర్మన్ భూమా కృష్ణమోహన్ శెట్టి ,నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు ఆలయంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి సమేత భూదేవి శ్రీదేవి లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరంతీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాలపై ఈవోఆడిగి తెలుసుకున్నారు అంతకు ముందు టిడిపి నాయకుడు తూవ్వ భగీరథ రెడ్డి, బస్టాండ్ సెంటర్ నుంచి మేళతాళాలతో బైరెడ్డి శబరికి ఘన స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో తూవ్వా భగీరథరెడ్డి టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కాకరవాడ వెంకటస్వామి,మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, సివిల్ సప్లై డైరెక్టర్ మహేష్ నాయుడు, తూవ్వా అయ్యప్ప రెడ్డి మాజీ జెడ్పిటిసి నాగేశ్వరరావు ,వంగాల సీతారామిరెడ్డి, అంకిరెడ్డి, కురువ గోకారి , సీఐసుబ్రహ్మణ్యం ఎస్సై సిహెచ్ ఓబులేష్ స్వామి వారిని దర్శించుకున్నారు.

# దేశంలో యుద్ధ వాతావరణం ఇంకా ముగియలేదు




భరతమాతకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారతదేశంలో యుద్ధ వాతావరణం ఇంకా ముగియలేదని సైనికులు అప్రమత్తంగా ఉంటూ దేశాన్ని కాపాడాలని ప్రధాని మోడీ పిలుపునివ్వడం జరిగిందని టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య తెలిపారు. ఆదివారం జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా రెండోరోజు దేశభక్తి నృత్య ప్రదర్శనలు, గేయాల ఆలాపన జరిగింది. అనంతరం జ్యోతి ప్రజ్వళన చేసి భారతమాత చిత్రపటానికి సైనిక వేషాధారణతో కళాకారులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ కొనసాగుతుందని ప్రధాని మోడీ చెప్పారన్నారు. సైన్యానికిభారతప్రజల మద్దతు,ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. అందుకే టీజీవి కళాక్షేత్రంలో ఈ నెల 16నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందులో భాగంగా రెండవరోజు నాట్యాచార్యులు నారాయణ స్వామి శిష్య బృందం నృత్య ప్రదర్శనలు, చంద్రకంటి మద్దయ్య, బాల వెంకటేశ్వర్లు బృందం దేశభక్తి గీతాలను ఆలపించారు. చివరిగా మొలగవల్లి రవికుమార్ శ్రీరామునిగా, నెల్లూరు ఈశ్వర్ గౌడ్ ఆంజనేయునిగా నటించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు దస్తగిరి, నారాయణరెడ్డి, కన్వీనర్ పి రాజారత్నం,వి శ్రీనివాసరెడ్డి, రాముడు, సంఘుఆంజనేయులు పాల్గొన్నారు.

**నేడు రచయిత్రుల సమ్మేళనం :-** జై జవాన్ కల్చరల్‌లో భాగంగా నేడు సోమవారం డాక్టర్ పార్వతి సుబ్బలక్ష్మి సునీత ఆధ్వర్యంలో మహిళల దేశభక్తి గీతాలాపన , కవయిత్రుల సమ్మేళనం ఉంటుందని టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు.

# వైభవోపేతంగా శ్రీప్రహ్లాద నృసింహ స్వామి కళ్యాణ వైభోగం

**- ఆలయాల్లో వేద మంత్రాలతో అభిషేకాలు**
**- శ్రీజగన్నాథ మందిర్‌లో 20రకాల పండ్లతో అభిషేకం**



కల్యాణోత్సవాని తిలకిస్తున్న భక్తులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** భక్తులకు అభయమిచ్చే శ్రీనరసింహస్వామి కేవలం అవతారమూర్తి కాదు ఆ స్వామి మంత్రమూర్తి అని వేదాంతాలుగా భాసిల్లే ఉపనిషత్తులలో నరసింహ తత్వం వర్ణించబడి ఉందని స్వామి నామ మంత్రాన్ని ఒకసారి పఠిస్తే భక్తులకు అభయమిస్తాడని పురాణవచనం. ఆదివారం వైశాఖ మాసం శుక్లపక్షం స్వాతి నక్షత్రం, శ్రీనృసింహ స్వామి జన్మదినం పురస్కరించుకుని పట్టణంలోని శ్రీనివాససెంటర్‌లో వెలసిన శ్రీజగన్నాథ మందిర్‌లో నరసింహ ప్రభు ఆధ్వర్యంలో స్వామి



శ్రీజగన్నాథ మందిర్‌లో శ్రీనృసింహస్వామికి పండ్లతో అభిషేకం చేస్తున్న నరసింహప్రభు

విగ్రహానికి 20రకాల పండ్లతో అత్యంత వైభవోపేతంగా అభిషేకాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలతో స్వామివారికి భక్తులు హరేనామ భజనలు చేస్తుండగా స్వామివారి అభిషేకాన్ని ఆద్యంతం తిలకించి తన్మయత్వం చెందారు. అలాగే తెలుగుపేటలో వెలసిన శ్రీఘన మద్దులే టి స్వామి దేవస్థానంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీమద్దులేటి లక్ష్మి నృసింహస్వామి కల్యాణోత్సవాన్ని వేదమంత్రాలతో అర్చకులు నిర్వహించారు. మధుసూధన్ రాయల్ ఆధ్వర్యంలో కల్యాణోత్సవానికి స్వామి అమ్మ వార్ల తరపున దాతలు, భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# రెవెన్యూ ఉద్యోగులకు అన్నీ కష్టాలే

**– అధికారుల ఒత్తిడి.. రాజకీయ నాయకుల బెదిరింపులు**

**శిరివెళ్ల, మేజర్‌న్యూస్ :** రెవెన్యూ ఉద్యోగులకు కార్యాలయానికి వచ్చినప్పటి నుంచి ఇంటికి వెళ్లే వరకు అన్నీ కష్టాలే. కష్టాల మధ్య ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని రెవెన్యూ ఉద్యోగులు మొరపెట్టుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఒత్తిడిలు రాజకీయ నాయకుల బెదిరింపులు తాళలేక ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఈ మధ్య శిరివెళ్ల తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలను ఎవరికి చెప్పుకోలేక ఉద్యోగాలనను కొనసాగిస్తున్నట్లు చర్చించుకోవడం మొదలైంది. మండల సర్వేయర్ కోర్టుకు వెళ్లడం కోర్టుకు సమాధానం చెప్పుకోలేక, ఏమీ చేయలేక మరలా కోర్టు పిలిపించడం సమాధానం చెప్పుకోలేకపోవడంతో ఉన్నతాధికారి అయిన తహశీల్దార్‌ను కోర్టుకు పిలిపించడం జరిగింది. ఇన్ని కష్ట నష్టాలతో ఉద్యోగం చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఉద్యోగులు పేర్కొన్నారు. సమస్యల మధ్య ఉన్న కొలతలకు వెళ్తే ఒక సమస్య వెళ్లకపోతే మరో సమస్య. ఈ సమస్యలతో సర్వేయర్ కొలతలకు వెళ్లకపోవడంతో సమస్యలు వచ్చి పడ్డాయని పేర్కొన్నారు.

## అప్పుల బాధ తాళలేక బంగారు షాపు యజమాని ఆత్మహత్య



మృతిచెందిన వెంకటేశ్వర్లు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని చిత్తారి గేరిలో నివాసముంటున్న బంగారు షాపు యజమాని గూడూరు వెంకటేశ్వర్లు(52) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గూడూరు వెంకటేశ్వర్లు షరాఫ్ బజార్‌లో బంగారు వ్యాపారం చేస్తుండేవాడు. గత నాలుగు నెలల క్రితం అతని భార్య ఆరోగ్యం బాగోలేక మృతిచెందింది. దీంతో మనస్థాపానికి గురై తనలో తానే ఆందోళన పడేవాడు. గత కొన్నిరోజులుగా అప్పులు కూడా పెరిగిపోవడంతో ఫైనాన్స్ వ్యాపారుల ఒత్తిడికి లోనైన ఆయన ఆదివారం సాయంత్రం చిత్తారిగేరిలో తన ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు, అతని బంధువులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయాడని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. శవాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తన తండ్రి వెంకటేశ్వర్లు చావుకు పూర్తి కారణాలు తెలుసుకోవాలని కుమారుడు రాఘవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గొల్లలదొడ్డి గ్రామంలో విషాదం



మృతుడు బోయ నాయుడు (ఫైల్ ఫోటో )

**సి.బెళగల్ మేజర్‌న్యూస్ :** సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డి గ్రామంలో ఆదివారం విషాదచాయాలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన బోయ దుబ్బచంద్రన్న కుమారుడు బోయ నాయుడు (24) ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఆదివారం కుటుంబంతో కలసి మండలంలోని బ్యాతోలి గ్రామంలోని బంధువుల ఇంటిలో జరిగే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సాయత్రం సమయంలో సరదాగా తన తోటి వారితో కలసి ఇతకు వెళ్లిన బోయ నాయుడు ప్రమాదవశత్తు నీటిలో కురుకపోయి మృతి చేదాడని తెలిపారు. ప్రమాదవశత్తు నీటిలో కురుకపోయి మృతి చెందిన బోయ నాయుడు కుటుంబానికి ప్రభత్వం అండగా ఉండి ఆదుకోవాలని టీడీపి జిల్లా మైనారిటీ అధ్యక్షుడు దూద్ వలి సూచించారు.

# అన్నదాతను కాటేసిన కరెంటు

**– పొలంలోనే కరెంట్‌షాక్‌తో కూలిపోయిన రైతు – కుమారుడికి తప్పిన ప్రమాదం**





చనిపోయిన రైతు మునిస్వామి(ఫైల్‌ఫోటో) రైతు ప్రాణాలు బలితీసుకున్న బోరు

**కోసిగి మేజర్ న్యూస్:** అన్నదాత నిద్రలేవగానే మొదటిగా పొలం, తరువాత కుటుంబం అని అనుకొని తన పొలంలో పంటకు నీరు పెట్టడానికి తెల్లవారుజామున వెళ్ళిన అన్నదాతకు తెల్లారకముందే తన ఆయుష్షు తెల్లారిపోయిన సంఘటన కోసిగి మండలంలోని చింతకుంట గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే చింతకుంట గ్రామానికి చెందిన హనుమయ్యగారి మునిస్వామి అనే రైతు తన పొలంలో వేసుకొన్న వేరుశనగ పంటకు కుమారుడితో కలిసి తెల్లవారుజామను నీళ్ళు పెట్టడానికి వెళ్ళడం జరిగింది. నీరు పెట్టడానికి అని మోటర్‌ను ఆన్‌చేయగా బోరునుండి నీరు రాకపోవడంతో బోర్ పైప్‌లైన్‌లను తాకడం జరిగింది. ఒక్కసారిగా కరెంట్‌షాక్ తగలడంతో పొలంలోనే కుప్పకూలిపోయారు. బోరుపైపుకు కరెంటు సరఫరా ఉందనే విషయం అన్నదాతకు తెలియకపోవడంతో పైప్‌ను తాకడంతోనే ఒక్కసారిగా షాక్‌కు గురై చనిపోయినట్లు భార్య పార్వతి తెలిపారు. అయితే తనతోపాటు వచ్చిన కుమారుడు పంటకు నీళ్ళు పెట్టడానికి పనుల్లో నిమగ్నమై ఉండగా ఈ ప్రమాదం జరిగింది. ఈవిషయం తెలియని కుమారుడు తెల్లారిన తరువాత బోరుదగ్గరకు వెళ్ళిచూస్తే తన తండ్రి పడిపోయిన విషయాన్ని గమనించి తాకడానికి ప్రయత్నించాడు. ఆ కుమారుడికి కూడా షాక్ తగలడంతో ఎలాగో ప్రమాదం నుండి బయట పడ్డాడు. ఈ విషయాన్ని తమ కుటుంబ సభ్యులకు తెలిపారు. చనిపోయిన రైతు మునిస్వామిని చూసి గుండెలు బాధుకొని బోరున విలపించారు. వారి ఆర్తనాథాలను చూసి చుట్టుపక్కల వారు కన్నీరుమున్నీరు అయ్యారు. ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.